చీర్యాల దేవాలయానికి భక్తుల తాకిడి

కీసర: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహా స్వామి ఆలయానికి శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు స్వామి దర్శనం కోసం తరలి వచ్చారు. గర్భాలయంలో కొలువైన శ్రీ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకొని శ్రావణమాసం మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్‌ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సందడిగా ‘రక్షాబంధన్‌’

మేడ్చల్‌: రాఖీ పండగ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్‌ ఉత్సవాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు రాఖీల తయారీపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాలలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యాలరావు, నవీన్‌, మంజుల, రంగారావు, వసీం పాల్గొన్నారు.





ఘట్‌కేసర్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగులు



మేడ్చల్‌ సీహెచ్‌ఎన్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు



మెడిసిటీ ఆస్పత్రిలో ఓపీ లేక బయటకు వెళ్తున్న రోగులు

వైద్యం అందక రోగుల పరేషాన్‌!

- కోల్‌కతా ఘటనపై వైద్య వర్గాల్లో నిరసన వెల్లువ
- విధులు బహిష్కరించిన వైద్యులు
- నిలిచిపోయిన ఓపీ సేవలు
- రోగులకు తప్పని ఇబ్బందులు

మేడ్చల్‌: కోల్‌కతాలోని వైద్య కళాశాలలో వైద్యురాలిపై జరిగిన అమానుష ఘటనను నిరసిస్తూ వైద్యులు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలతో మేడ్చల్‌ నియోజకవర్గంలోని వివిధ ఆస్పత్రులలో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు తమ విధులను బహిష్కరించి ఔట్‌ పేషెంట్‌ విభాగ సేవలకు దూరంగా ఉన్నారు. కోల్‌కతాలో మృతిచెందిన వైద్యురాలికి న్యాయం చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. విధులను బహిష్కరించి ఆస్పత్రుల వద్ద నిరసన, ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. మేడ్చల్‌లో జాతీయ రహదారిపై మెడిసిటీ ఆస్పత్రి మెడికోలు ర్యాలీ నిర్వహించారు. కీసర, మేడ్చల్‌, ఘట్‌కేసర్‌, శామీర్‌పేట్‌, జవహర్‌నగర్‌ పీహెచ్‌సీలు, మేడ్చల్‌, ఘట్‌కేసర్‌ సీహెచ్‌ఎన్‌సీల వద్ద వైద్యులు నిరసన తెలిపారు. పలు ప్రాంతాల్లో కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలలో ఓపీ సేవలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వెంకటాపూర్‌ నీలిమా వైద్య కళాశాల విద్యార్థులు



అలియాబాద్‌ బస్తీ దవాఖాన వద్ద వైద్యులు



మేడ్చల్‌లోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

మూడు గ్రామాలను విలీనం చేయొద్దని జిల్లా మంత్రికి వినతి

ఘట్‌కేసర్‌: మాదారం, అంకుషాపూర్‌, అవుషాపూర్‌ గ్రామాలను ఇతర జిల్లాలో విలీనం చేయకూడదని మేడ్చల్‌ జిల్లా ఇన్‌చార్జ్‌, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును ఆయన నివాసంలో శనివారం అఖిలపక్ష నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. మూడు గ్రామాల విలీనం వదంతులేనని, నమ్మకూడదని మంత్రి చెప్పారని నాయకులు తెలిపారు. మీరు కోరుకున్నట్లే ఉంటుందని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నేతలు కొండల్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, శోభారాణి, ఐలయ్య యాదవ్‌, శ్రీనివాస్‌రెడ్డి, మశ్చేందర్‌ రెడ్డి, మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బుచ్చిరెడ్డి, దయాకర్‌రెడ్డి, శంకర్‌ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవనాలు ప్రారంభం



కీసర: నాగారంలోని రాజ్‌సుఖ్‌నగర్‌కాలనీ, రాంపల్లిలో సుమారు రూ. 43 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాల కొత్త భవనాలను నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, కమిషనర్‌ రాజేంద్రకుమార్‌, కౌన్సిలర్లు చింతల సరితరమేష్‌, ఎలిజాల నాగేష్‌గౌడ్‌, గోల కళావతి, బదనపురం శ్రీనివాస్‌, కో ఆప్షన్‌ సభ్యులు క్యాసారం అశోక్‌గౌడ్‌, ఆదం షఫిక్‌ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుర్చీల వితరణ



కీసర: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు కూర్చునేందుకు అవసరమైన కుర్చీలను విరాళంగా అందజేసే కార్యక్రమాన్ని నూకల గూడెం సత్తిరెడ్డి కొనసాగిస్తున్నారు. శనివారం చీర్యాల గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆయన కుర్చీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని మిగతా గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లకు కుర్చీలను అందజేస్తామన్నారు. నూకల గూడెండ చిన్నప్పరెడ్డి, పీఏసీఎస్‌ సభ్యుడు రామిడి శ్రీనివాస్‌రెడ్డి, శివలింగాల శ్రీనివాస్‌గౌడ్‌, బోడ శ్రీనివాస్‌రావు, సింగిరెడ్డి హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో సర్దార్‌ సర్వాయి పాపన్న జయంతి

సాక్షి, సిటీబ్యూరో: సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ జయంతి వేడుకలను ఆదివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని బీసీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆశాఖ జిల్లా అధికారి కేశురామ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, గౌడ కుల సంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముగిసిన వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం





విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

శామీర్‌పేట్‌: శామీర్‌పేటలోని వీర భద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శనివారంతో ముగిసింది. పలువురు ప్రముఖులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌, మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్‌ వజ్రేష్‌ యాదవ్‌, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు.

వీధి కుక్కల దాడిలో మేకలు, గొర్రెల మృతి

కీసర: వీధి కుక్కల దాడిలో సుమారు రూ. 50 వేల విలువ చేసే నాలుగు మేకలు, గొర్రెలు మృతిచెందాయి. వివరాలివీ... కీసర గ్రామానికి చెందిన కందాడి రామ్‌కుమార్‌రెడ్డి తమ వ్యవసాయ క్షేత్రం వద్ద జీవాలను పెంచుతున్నాడు. శనివారం మధ్యాహ్నం వీధి కుక్కలు ఆ జీవాలపై దాడి చేసి రెండు మేకలు, రెండు గొర్రెలను చంపేసాయి. సుమారు రూ. 50 వేల విలువ చేసే జీవాలను కుక్కలు దాడి చేసి చంపేయడం పట్ల రైతు రామ్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు.

క్రికెట్‌లో సత్తాచాటిన విద్యార్థులు

బోడుప్పల్‌: హెచ్‌సీఏయూ 16 ఇంటర్‌ స్కూల్‌, కాలేజీ క్రికెట్‌ టోర్నమెంట్‌లో బోడుప్పల్‌ కిరణ్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ విద్యార్థులు సత్తా చాటారు. కరీంగూడలో జరిగిన హెచ్‌సీఏ మ్యాచ్‌లో విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకులు రితేష్‌ ఈ సందర్భంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. కెప్టెన్‌ ధృవ 53 బంతుల్లో 48 పరుగులతో నాటౌట్‌గా నిలవగా. ప్రియం ఆచార్య 4.1 ఓవర్లలో 17 పరుగులు, బౌలింగ్‌లో మూడు వికెట్లు తీసినట్లు తెలిపారు. అభిరామ్‌ నుజ్జుల 4 ఓవర్లలో 9 పరుగులతోపాటు మూడు వికెట్లు తీశాడు. విద్యార్థులను చదువుతోపాటు అన్ని రకాల క్రీడల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.



వేతనాలు చెల్లించాలని కాంట్రాక్ట్‌ ఉద్యోగుల ఆందోళన



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టిన కాంట్రాక్ట్‌ ఉద్యోగులు

ఘట్‌కేసర్‌: రెండు నెలల పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్‌ ఉద్యోగులు ఆ ఆస్పత్రి ఎదుట ఏఐటీయూసీ యూనియన్‌ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్‌, సెక్యూరిటీ, ఇతర సిబ్బందికి ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లిస్తుంటారని, కాని రెండు నెలలుగా పూర్తిగా వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఈఎస్‌ఐ, పీఎఫ్‌ వాటా కూడా చెల్లించడం లేదని వాపోయారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు, జయచంద్ర, ఈశ్వర్‌, ఆస్పత్రి కాంట్రాక్ట్‌ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్‌) ఎంతగానో ఉపయోగపడుతుందని మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం గోధుమకుంట గ్రామానికి చెందిన టి.రాజుకు సీఎంఆర్‌ఎఫ్‌ కింద మంజూరైన రూ 10 వేలకు సంబంధించిన చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ ఆకిటి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణ మహోత్సవం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి హనుమత్‌సేవ(రథోత్సవం) ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి , కార్పొరేటర్లు శ్రవణ్‌, రాజ్యలక్ష్మి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సుదర్శనహోమం, పుష్పయాగం, డోలోత్సవం, దర్బార్‌ సేవ జరుగుతుందని ఈవో రవీందర్‌రెడ్డి, అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు తెలిపారు.

అతివలకు బీమా.. ఎంతో ధీమా!

- ఉచిత రుణ బీమా, ప్రమాద బీమాతో ఆర్థిక సాయం
- మహిళా సంఘాలకు ప్రత్యేక రుణాలిస్తున్న సర్కారు
- రెండు రకాల బీమాతో గ్రామ, పట్టణాల్లో అమలు
- 1,09,361 మంది మహిళా సభ్యులకు ప్రయోజనం

సాక్షి, సిటీబ్యూరో: మహిళా శక్తి పేరుతో ప్రత్యేక రుణాలు అందించడానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం.. అతివల కోసం రెండు రకాల బీమా పథకాలను అమల్లోకి తెచ్చింది. ఉచితంగా రుణ బీమాతో పాటు ప్రమాద బీమా కల్పిస్తోంది. పొదుపు సంఘంలో రుణం తీసుకున్న మహిళ ప్రమాదవశాత్తు మరణిస్తే.. రుణమాఫీతో పాటు ప్రమాద బీమా ద్వారా ఆర్థిక సాయం అందనుంది. మార్చిలోనే రుణ బీమా ప్రకటించగా.. తాజాగా ప్రమాద బీమాకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం ఇటీవల గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులకు జారీ చేసింది. ఈ రెండు పథకాలను గత మార్చి నుంచి అమల్లోకి తెచ్చింది.



1.09 లక్షల మహిళా సభ్యులకు ప్రయోజనం..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని రూరల్‌ ప్రాంతంలో 13 పురపాలక సంఘాలు ఉండగా, ఐదు మండలాల పరిధిలో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని డీఆర్‌డీఏ,మెప్మా అధ్వర్యంలో 10,750 స్వయం సహాయక మహిళా సంఘాలు పని చేస్తుండగా, ఇందులో 1,09,361 మంది సభ్యులు ఉన్నారు.వీరందరికి ప్రభుత్వం అమలు పరచనున్న రెండు బీమాలు ప్రయోజనాన్ని చేకూర్చనున్నాయి. ఇదిలా ఉండగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)అధ్వర్యంలో ఐదు మండలాలకు సంబంధించి ఒక జిల్లా సమాఖ్య, ఐదు మండల సమాఖ్యలు, 3,395 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండగా, వీటి పరిధిలో 36,911 మంది సభ్యులు ఉన్నారు.మెప్మా అధ్వర్యంలో 13 పురపాలక సంఘాల పరిధిలో 13 టౌన్‌ లెవల్‌ మహిళా సమాఖ్యలు, 208 ఏరియా లెవల్‌ మహిళా సమాఖ్యలు, 7,245 మహిళా సంఘాలు పని చేస్తుండగా, ఇందులో 72,450 మంది సభ్యులు ఉన్నారు.

- ఈ సంఘాల్లోని సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి, చిరువ్యాపారులు చేసుకునేందుకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, మహిళా శక్తి పథకాల ద్వారా వివిధ రుణాలను ప్రభుత్వం అందజేస్తోంది.

ప్రమాద బీమా రూ. 10 లక్షలు

స్వయం స్వహాయహక (పొదుపు) మహిళా సంఘాల మహిళలు ప్రమాదవశాత్తు మృతి చెందితే.. వారి కుటుంబాలకు రూ. 10 లక్షల ఉచిత బీమా వర్తింపజేయనున్నారు. ఒకవేళ వంద శాతం వైకల్యం కలిగినా రూ. 10 లక్షలు అందిస్తారు. 50 శాతం వైకల్యం కలిగితే రూ. 5 లక్షలు చెల్లిస్తారు. మృతి చెందిన మహిళకు పొదుపు అప్పు ఉంటే అది పూర్తిగా మాఫీ చేస్తారు. గాయాలైన మహిళ అంగవైకల్యం తెలిపే సదరం ధ్రువపత్రాలు, చికిత్స పొందిన ఆస్పత్రి పత్రాలు సమర్పించాలి. మరణించిన వారి పోస్టుమార్టం నివేదిక, పోలీసుల పరిశోధన నివేదిక ఇవ్వాల్సి ఉంటోంది. 18 నుంచి 60 ఏళ్ల వయసున్న పొదుపు మహిళలకు మాత్రమే ఇది వర్తింపజేస్తారు.

ప్రత్యేక దృష్టిసారిస్తేనే...

బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం లేదు. ఈ రెండు పథకాల్లో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపుల వారు నెలవారీ సమావేశాలు నిర్వహించాలి. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్‌ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి. ఇలాంటి వాటిపై మహిళల్లో పూర్తిస్థాయిలో అవగాహన లేదు. చాలా గ్రూపుల్లో నెలవారీ సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదు. దీనిపై సెర్ప్‌, మెప్మా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.



మహిళలకు ఎంతో ప్రయోజనం...



మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు రెండు రకాల బీమా సౌకర్యం కల్పించడంతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వ నిర్ణయంతో సభ్యుల కుటుంబాలకు, రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తోంది. దీనిపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని అన్ని మండలాల్లో క్రమం తప్పకుండా సమావేశాలను నిర్వహించేలా చూస్తాం.

– సాంబశివరావు, డీఆర్డీవ, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా

అదుపు తప్పి దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

మద్యం మత్తులో కారును నడిపిన డ్రైవర్‌

జవహర్‌నగర్‌: వేగంగా వచ్చిన ఓ కారు పండ్ల దుకాణంలోకి దూసుకెళ్లిన సంఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... జవహర్‌నగర్‌ సంతోష్‌నగర్‌లో నివసించే సురేష్‌ మద్యం మత్తులో శుక్రవారం రాత్రి దమ్మాయిగూడ వైపు వేగంగా వెళ్లాడు. దీంతో రోడ్డు పక్కనే ఉన్న పండ్ల దుకాణాల వైపు దూసుకెళ్లగా పండ్లు కింద పడి, ఇరువురికి గాయాలయ్యాయి. దీంతో తమకు ఆస్థి నష్టం జరిగిందని పండ్ల వ్యాపారులు జవహర్‌నగర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పండ్ల దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

టీబీ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



పీహెచ్‌సీలో జాయింట్‌ డైరెక్టర్‌ రాజేశం

శామీర్‌పేట్‌: క్షయ (టీబీ) వ్యాధిగ్రస్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర జాయింట్‌ డైరెక్టర్‌ రాజేశం అన్నారు. శనివారం శామీర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధి గ్రస్తులకు ఇస్తున్న వైద్య సౌకర్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలలించారు. టీబీ ప్రోగ్రాం ఆఫీసర్‌ శ్రీదేవి, డాక్టర్‌ రవీంద్ర, డాక్టర్‌ శ్వేత పాల్గొన్నారు.

నియామకం

శామీర్‌పేట్‌: కాంగ్రెస్‌ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా తుంకి రమేష్‌ నియమితులయ్యారని పార్టీ శామీర్‌పేట మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్‌ తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మేడ్చల్‌ జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆయనకు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, అర్హులకు లబ్ధిచేకూరేలా కృషిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తానని తుంకి రమేష్‌ తెలిపారు. మహిళా విభాగం మండల అధ్యక్షురాలు నర్మద, బీసీ సెల్‌ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న రమేష్‌

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య



మహేందర్‌ (ఫైల్‌)

కీసర: మద్యం మత్తులో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన కీసర పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని నాగారంలో చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్‌ వెంకటయ్య, నాగారం సెక్టార్‌ ఎస్‌ఐ నాగరాజు సమాచారం మేరకు... నాగారంలో నివసించే అన్నంరాజు మహేందర్‌(45) కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య ఇద్దరు పిల్లలను లోపల గదిలో పడుకోమని చెప్పి అతను హాల్‌లో పడుకున్నాడు. శనివారం ఉదయం భార్య నిద్ర లేచి బయటకు వచ్చే సరికి మహేందర్‌ హాల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేలాడుతూ కన్పించాడు. ఒక్కసారిగా నిర్ఘాంత పోయి కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చారు. గతంలో సైతం అతను ఆత్మహత్యాయత్నం చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించి..

‘స్ఫూర్తి’గా నిలుస్తున్న స్ఫూర్తి



మల్కాజిగిరి: పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని మల్కాజిగిరి సఫిల్‌గూడకు చెందిన అప్పల స్ఫూర్తి నిరూపించారు. 2018లో ఉస్మానియాలో ఇంజినీరింగ్‌ అనంతరం ఎంబీఏ చేసిన ఆమె పూణేలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగిగా పనిచేసి రాజీనామా చేశారు. ఎలాంటి కోచింగ్‌ లేకుండా ఇంటి వద్దే ఉంటూ.. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాసి ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించడమే కాకుండా గ్రూప్‌– 1 ప్రిలిమ్స్‌కు క్వాలిఫై కావడంతో మెయిన్స్‌కు సన్నద్ధమవుతున్నారు. పబ్లిక్‌ హెల్త్‌ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈగా, పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహించిన ఏఈ, గ్రూప్‌ –4 కు ఎంపికయ్యారు.